# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-05-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది.**

2. **ప్రజలకు పూర్తిస్థాయిలో ప్రభుత్వ సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.**

3. **నల్లమల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి తెలిపారు.**

4. **ఆంధ్రప్రదేశ్ లో ఉగ్రవాద కదలికలపై నిరంతర అప్రమత్తత అవసరమని ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.**

5. **ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉభయ తెలుగురాష్ట్రాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయని భారత వాతావరణ శాఖ తెలిపింది.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ఇటీవల రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి- ఎస్ఐపీబీలో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదం తెలపడంతో పాటు మరిన్ని అంశాలపై చర్చించి ఆమోదం తెలిపే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

--------------------------

ప్రజలకు పూర్తిస్థాయిలో ప్రభుత్వ సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్రంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, సేవల అమలుపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేషన్, దీపం-2, వంటి పథకాలు, పౌరసేవలపై జూన్ 12వ తేదీ తర్వాత ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ఆర్టీసీలో సౌకర్యాలు, సదుపాయాలు ఇంకా మెరుగుపరచాలని ఆదేశాలు జారీ చేశారు. దీపం లబ్ధిదారులకు ఒకేసారి 3 సిలిండర్ల నగదు జమ చేసే అంశంపై పరిశీలించాలన్నారు. గణాంకాల సమాచారానికి అన్ని శాఖల్లో అత్యంత ప్రాధాన్యమివ్వాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

--------------------------

నల్లమల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని ముఖ్యమంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా 'నల్లమల డిక్లరేషన్'ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. పోడు భూములను వ్యవసాయానికి అనుకూలంగా మారుస్తున్నామని చెప్పారు. సన్న ధ్యాన్యం పండించే రైతులకు అదనపు నగదు అందిస్తున్నామని తెలుపుతూ,

వాయిస్ 29 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఉగ్రవాద కదలికలపై నిరంతర అప్రమత్తత అవసరమని ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెవిజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తాకు ఆయన లేఖ రాశారు. తీర ప్రాంత జిల్లాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఉగ్రవాద సానుభూతిపరులపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రాష్ట్ర వ్యాప్తంగా అంతర్గత భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో డీఎస్సీ పరీక్షకు సంబంధించిన స్టడీ మెటీరియల్ ను ఆయన నిన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, డీఎస్సీకి సిద్ధం అవుతున్న అభ్యర్థులకు ఉపకరిస్తుందని తెలిపారు. ప్రభుత్వ సంస్కరణలతో విద్యారంగం బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ బాపట్ల జిల్లాలోని సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానాన్ని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సింగరకొండలో నిర్వహించిన ఆలయ మహా కుంభాభిషేకం కార్యక్రమంలో మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించి అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 'సింగరకొండ క్షేత్ర వైభవం' పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ,

వాయిస్ 28 సెకన్లు

---------------------------

తెలంగాణలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు భూమి సర్వే మ్యాపును జతపరచడం తప్పనిసరి చేశామని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధానాన్ని వీలైనంత త్వరగా అమలులోకి తీసుకు రావడానికి 10,031 సర్వేయర్లకు శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. ఈనెల 26 నుంచి గచ్చిబౌలిలోని సర్వే ట్రైనింగ్ అకాడమీలో రెండునెలల పాటు శిక్షణ ఇస్తామని తెలిపారు.

---------------------------

ఆపరేషన్ సిందూర్ విజయానికి మద్దతుగా, భారత సైనికుల పరాక్రమానికి దేశం గౌరవ వందనాలను తెలుపుతోంది. సాయుధ దళాలకు సంఘీభావంగా, ఆకాశవాణి వార్తా విభాగం ప్రత్యేక కథనాన్ని అందిస్తోంది. ఇందులో భాగంగా 1971 యుద్ధంలో అసాధారణమైన ధైర్యసాహసాలను ప్రదర్శించిన పరమ వీర చక్ర పురస్కార గ్రహీత కల్నల్ హొషియార్ సింగ్ గురించి ఈ రోజు తెలుసుకుందాం.

వాయిస్ ..35 సెకన్లు

---------------------------

స్వాతంత్ర్య సమరయోధులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి ఈరోజు. 1872 ఆగష్టు 23న నిరుపేద కుటుంబంలో జన్మించిన ప్రకాశం పంతులు ఆంధ్రకేసరిగా బిరుదు గడించారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించారు. 1957 మే 20వ తేదీన ఆయన తుదిశ్వాస విడిచారు. ఈరోజు టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మరించుకుంటూ తెలుగు ప్రజలు నివాళులు అర్పిస్తున్నారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రానున్న 24 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో కొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. తెలంగాణలోనూ రానున్న మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈరోజు అక్కడక్కడా తేలికపాటి వర్షాలు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాముందని తెలిపింది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ మనసులోని మాట" కార్యక్రమం 122వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 117800 నెంబర్‌కు ఈనెల 23వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

=====================